సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



12 మందికి యావజ్జీవ శిక్ష

ఆధిపత్య పోరులో భాగంగా 16 ఏళ్ల క్రితం హత్యకు గురైన జీచు పుల్లారెడ్డి కేసులో 12 మందికి ప్రొద్దుటూరు ఏడీజే కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. -8లో



లౌకిక ప్రజాస్వామ్యం కోసం ఏచూరి కృషి

లౌకిక ప్రజాస్వామ్య రక్షణ కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎ గఫూర్ అన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
33.4/25.6

వాతావరణం

జిల్లాలో గురువారం 25.6 – 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

దుష్ప్రచారంపై ధర్మాగ్రహం

- తిరుమలతోపాటు లడ్డూ పవిత్రతను దెబ్బతీసేలా చంద్రబాబు అసత్య ప్రచారం
- నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తిరుపతికి వెళ్లకుండా పార్టీ నేతల హౌస్ అరెస్టులు, అడ్డగింత

సాక్షి రాయచోటి: తిరుమల పవిత్రతను..స్వామి వారి లడ్డూ ప్రసాదం విశిష్టతను..వెంకటేశ్వరస్వామి వైభవంతోపాటు టీటీడీ పేరు ప్రఖ్యాతులను రాజకీయ దుర్బుద్ధితో అసత్య ప్రచారం చేస్తున్న కూటమి సర్కార్‌పై వైఎస్సార్ సీపీ పోరుబాటకు సిద్ధమైంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుత సీఎం చంద్రబాబు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలతో చేస్తున్న రాజకీయ దుష్ప్రచారంపై యుద్ధం ప్రకటించారు. పవిత్రమైన తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కల్తీ జరగకపోయినా జరిగినట్లు చేస్తున్న ప్రచారంపై వైఎస్సార్ సీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మరోవైపు చంద్రబాబు అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఆలయాల్లో పూజలు చేయాలని పార్టీ నిర్ణయించింది.

- కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఇప్పటికీ సూపర్ సిక్స్ అమలు చేయకపోగా, సవాలక్ష కారణాలు చెబుతూ ఏదో ఒక రకంగా ముందుకు వెళుతుండంపై ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో ఏదో ఒక రకంగా టాపిక్‌ను డైవర్ట్ చేయడమే లక్ష్యంగా బాబు అండ్ కో బృందం మైండ్‌గేమ్ ఆడుతున్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. ఇంతవరకు హామీల అమలుకు కూటమి సర్కార్‌కు అవకాశం ఇచ్చిన వైఎస్సార్ సీపీ ఇక నేరుగా రంగంలోకి దిగాలని భావించి యుద్ధం ప్రకటించింది.



రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఇంటిలో ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, ఆయన సోదరుడు పి.గిరిధర్‌రెడ్డి

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అన్నమయ్యతోపాటు వైఎస్సార్ జిల్లాలోని ఆలయాల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్న నాయకులకు బుద్ధిరావాలని, లడ్డూ ప్రసాదంలో ఎలాంటి కల్తీ జరగలేదని... జరగని దానిని జరిగినట్లు చెబుతున్న కూటమి పెద్దలకు కనువిప్పు కలగాలని..వెంకటేశ్వరస్వామి పవిత్రతకు భంగం కలిగిస్తున్న వైనాలను నిరసిస్తూ పార్టీ శ్రేణులు శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

అడుగడుగునా నిర్బంధం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలకు వస్తున్నారన్న విషయాన్ని తెలుసుకుని ఆయనను కలిసేందుకు వస్తున్న పార్టీ నేతలు పోలీసులు ఎక్కడికక్కడ అడ్డగించారు. కొంతమంది నేతలను ఇళ్ల వద్దనే గృహ నిర్బంధం చేయగా, మరికొంతమందికి నోటీసులు ఇచ్చి అదుపు చేశారు. ప్రధానంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డిని, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్ జిల్లా పార్టీ అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ సురేష్‌బాబు, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, సుధీర్‌రెడ్డిలకు నోటీసులు ఇచ్చి ఇంటి నుంచి కదలకుండా చేశారు. అలాగే రాష్ట్ర నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డిని కూడా పోలీసులు అడ్డగించారు. తిరుపతికి వెళుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిని రైల్వేకోడూరు చెక్‌పోస్టు వద్ద ఆపి వెనక్కి పంపించారు. మదనపల్లె ఇన్‌చార్జి నిసార్ అహ్మద్‌ను కూడా హౌస్ అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డికి పోలీసులు నోటీసులు అందజేశారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్లు రామిశెట్టిశివయ్య, ఈశ్వర్‌నాయక్, వై.గిరిజ, రేణుకమ్మ తదితరులకు నోటీసులు జారీచేశారు.

నోటీసులతో భయపెట్టలేరు

- వైఎస్సార్ సీపీ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి



ఖాజీపేట: పోలీసులు నోటీసులు ఇచ్చి వైఎస్సార్ సీపీ నాయకులను భయపెట్టలేరని ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజనల్ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్ తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే సందర్భంగా నాయకులకు ఇలా నోటీసులు ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. నోటీసులు ఇస్తే ఎవ్వరూ పోరని అనుకోవడం కూటమి ప్రభుత్వం భ్రమ అన్నారు. కోట్ల మంది ప్రజల గుండెల్లో వైఎస్ జగన్ ఉన్నారని అన్నారు. ప్రజలను ఆపడం సాధ్యం కాదని అన్నారు. తనతో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులకు పోలీసులు నోటీసులు జారీ చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు.

నోటీసులు ఇవ్వడం దారుణం

- ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్



ప్రొద్దుటూరు కల్చరల్: తిరుమలకు పాపప్రక్షాళన కార్యక్రమానికి వెళ్లకూడదంటూ అర్ధరాత్రి తన ఇంటికి వచ్చి పోలీసులు తనకు నోటీసులు ఇవ్వడం దారుణమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు ఆర్.రమేష్ యాదవ్ పేర్కొన్నారు. 30యాక్ట్ అమలులో ఉందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటనకు తాను వెళ్లకూడదంటూ పోలీసులు నోటీసులు అందించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వెంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే నాయకులకు ఎప్పుడూ ఈ విధంగా నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెట్టిన సందర్భాలు లేవని తెలిపారు.

డిక్లరేషన్ పేరుతో కొత్త డ్రామా

- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల (అట్లూరు) : తిరుమల శ్రీవారి దర్శనానికి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్తుంటే.. అడ్డుకునేందుకు డిక్లరేషన్ పేరుతో కొత్త డ్రామా ఆడుతున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన పోరుమామిళ్లలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్ తిరుమలకు వెళ్లడం ఇదేమన్నా తొలిసారా? ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు పాదయాత్ర చేసి నేరుగా తిరుమలకు కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారని తెలిపారు. తర్వాత ముఖ్యమంత్రి హోదాలో శ్రీవారికి పట్టువస్త్రాలు అందజేశారని పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్రమోదీ తిరుమల పర్యటనకు వస్తే జగన్ వెంట ఉండి, మరీ శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారన్నారు. ఆ రోజు డిక్లరేషన్ గురించి బీజేపీ నాయకులకు గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. ప్రస్తుత కేంద్ర హోం మంత్రి, గతంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడి హోదాలో ఉన్న అమిత్‌షా కుటుంబ సమేతంగా తిరుమల పర్యటకు వస్తే అల్లర్లు సృష్టించిన ఘనత చంద్రబాబుదని గుర్తు చేశారు. కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కూటమి ప్రభుత్వం దురుద్దేశపూర్వకంగా వైఎస్ఆర్ సీపీ నాయకులకు నోటీసులు ఇచ్చిందని విమర్శించారు. దేవుళ్లను కూడా నీచ రాజకీయాలకు వాడుకునే చంద్రబాబుకు ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తిరుమల లడ్డూపై అసత్యాలు ప్రచారం చేసిన చంద్రబాబు నాయుడు పాపాలు.. ప్రజలపై పడకుండా చూడాలని శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పూజా కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వివరించారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్రం సబ్జెక్టు బోధించుటకు గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. రసాయనశాస్త్రంలో 50 శాతం మార్కులు పొందినవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో 30వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలకు స్వయంగా హాజరుకావాలని ఆమె తెలిపారు.

రేపు మంత్రికి పౌర సన్మానం



ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు వాసి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఈనెల 29న సాయంత్రం 5 గంటలకు స్థానిక రాయల్ కౌంటీలో పౌరసన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన మిత్రులు, పౌర సమాజం వారు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రేపు రిమ్స్ ఆడిటోరియం ప్రారంభం

కడప కోటిరెడ్డిసర్కిల్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ ఈనెల 29వ తేదీన జిల్లా పర్యటన నిమిత్తం రానున్నారు. మంత్రి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రొద్దుటూరులో జరిగే జిల్లా కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. అలాగే రాత్రి 7 గంటలకు ప్రొద్దుటూరు నగర పురప్రముఖుల సమావేశంలో పాల్గొంటారు. 30 వ తేదీన ఉదయం ప్రొద్దుటూరు సర్వజన ఆసుపత్రిలో పర్యటించి కడపకు చేరుకుంటారు. అనంతరం కడప రిమ్స్ ఆడిటోరియం, ల్యాబ్‌ను ప్రారంభిస్తారు. ఆ తర్వాత కడప నగరంలో పార్టీ నాయకులతో సమావేశాన్ని ముగించుకుని విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నారు.

జిల్లాలో 133 ప్రైవేట్ మద్యం దుకాణాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో త్వరలో 133 ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ఇందులో గీత కార్మికులకు 9 దుకాణాలను ప్రభుత్వం కేటాయించింది. అలాగే అన్నమయ్య జిల్లాకు 116 దుకాణాలు కేటాయించగా అందులో 7 గీత కార్మికులకు కేటాయించారు. ఈ మద్యం దుకాణాలు రెండు సంవత్సరాల కాలపరిమితితో ఉంటాయి. రెండవ సంవత్సరం లైసెన్స్ ఫీజు పది శాతం అదనంగా ప్రభుత్వం పెంచనున్నది. నేడో, రేపో ప్రైవేట్ మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

బాధ్యతల స్వీకరణ



నూతన డీటీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ (డీటీసీ)గా శుక్రవారం చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం డీటీసీగా పని చేస్తూ బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులకు మెరుగైన సేవలను అందించినప్పుడే రవాణాశాఖకు మంచి పేరు వస్తుందన్నారు. వాహనదారులు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం జిల్లాలోని ఎంవీఐలు, ఏఎంవీఐలు ఆయనను కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ప్రేరణ ఉత్సవ్ జాతీయ క్యాంపునకు కడప విద్యార్థులు



ప్రేరణ కార్యక్రమానికి తరలి వెళుతున్న విద్యార్థులతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: గుజరాత్ రాష్ట్రంలోని వార్డునగర్‌లో ఈ నెల 29 తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ ప్రేరణ ఉత్సవ్ క్యాంపునకు కడప నగరానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో నగరంలోని పీఎంశ్రీ గంగాభవాని ఉన్నత పాఠశాలకు చెందిన కర్నాటి భ్రమరాంబిక, పీఎంసీ కేంద్రియ విద్యాలయానికి చెందిన ఇంద్రనీల్‌లు ఎంపికయ్యారు. గత ఏడాది పాఠశాల స్థాయిలో వినూత్న అభ్యసన, సాంకేతికత జోడింపు తదితర అంశాలను పరిగణలోని తీసుకుని జిల్లా నుంచి వీరిద్దరినీ ఈ పోటీలకు ఎంపిక చేశారు. శుక్రవారం రాత్రి వీరు కడప నుంచి గుజరాత్‌కు బయలు దెరి వెళ్లారు. వీరిని పీఎంసీ గంగాభవాని హై స్కూల్ హెచ్‌ఎం మేరీ, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజకీయ లబ్ధి కోసం తిరుమల పవిత్రతను దెబ్బతీశారు

- ఎమ్మెల్యే డాక్టర్ సుధ



బద్వేలు అర్బన్: సీఎం చంద్రబాబు తన రాజకీయ లబ్ధి కోసం తమ వంద రోజుల పాలన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బతీస్తున్నారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరుమల పర్యటన సందర్భంగా 30 యాక్ట్ పేరుతో పోలీసులు తనతో పాటు నియోజకవర్గంలోని ముఖ్యనేతలకు నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డారు. లడ్డూ వివాదంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో గాని సీబీఐతో గాని విచారణ జరిపించాలని యావత్ హిందూ భక్తులందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేస్తుంటే ఆ దిశగా చర్యలు తీసుకోకుండా చంద్రబాబుకు అనుకూలమైన పోలీసు అధికారులతో సిట్ ఏర్పాటు చేయడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు.

శ్రీవారి దర్శనానికి అడ్డంకులా..?

- పోలీసుల నోటీసుల జారీ, హౌస్ అరెస్టులు దారుణం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా

కడప సెవెన్‌రోడ్స్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళుతుంటే.. కూటమి నేతలు అనేక విమర్శలకు పాల్పడటమే కాకుండా పలు అడ్డంకులు సృష్టించడం అప్రజాస్వామికమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కడపలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు దైవ దర్శనానికి వెళ్లకుండా 30 యాక్టు పేరుతో పోలీసులు అనుమతి లేదనడం, నోటీసులు జారీ చేయడం, హౌస్ అరెస్టులకు పాల్పడటం దారుణమన్నారు. రైల్వేకోడూరు సమీపంలో సాధారణ యాత్రికులను సైతం ఆపివేయడాన్ని ఏమనాలంటూ ప్రశ్నించారు. పవిత్ర తిరుమల లడ్డూను కళంకితం చేయడం ద్వారా సీఎం చంద్రబాబు హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో కులాలను రెచ్చగొట్టిన చంద్రబాబు ఇప్పుడు మతాలను రెచ్చగొట్టడం దుర్మార్గమన్నారు.

- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ వంద రోజుల పాలనలో ప్రజలకు ఏమి ఒరగబెట్టారని కూటమి నేతలు పండుగలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీల్లో ఎన్ని అమలు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు.
- కడప మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ 110 రోజుల కూటమి పాలనలో హామీలను అమలు చేయడం ద్వారా ప్రజల మన్నన పొందాల్సింది పోయి హింసా రాజకీయాలకు పాల్పడటం సరికాదన్నారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియోజకవర్గంలోకి వెళ్లకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. కడప నగరంలో జనసేన కార్యకర్తలు సైకోలుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మాజీ మంత్రి నాని ప్రెస్‌మీట్ పెడితే జనసేన నాయకులు ఆయన ఇంటిపై దాడి చేయడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీవారి దర్శనానికి వెళ్లే సమయంలో డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని పురందేశ్వరి, పయ్యావుల కేశవ్ మాట్లాడటం దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, షఫీ, తోట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల దృష్టి మళ్లించడానికే..

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి



వేంపల్లె : కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో ఏ ఒక్క ఎన్నికల హామీని అమలు చేయలేదని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం వేంపల్లెలోని తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎక్కడ తమ వైఫల్యాలు బయట పడతాయోనని ప్రజలను పక్కదారి పట్టించేందుకు లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తీసుకువచ్చారని ఆరోపించారు. బాబు హయాంలో 30 ఆలయాలను కూల్చి వేస్తే, వైఎస్ జగన్ పునరుద్ధరించిన విషయాన్ని గుర్తు చేశారు. తిరుమలకు వైఎస్ఆర్‌సీపీ నేతలు వెళ్లకుండా పోలీసులు నోటీసులు జారీ చేయడం తగదన్నారు. శుక్రవారం తనతో పాటు జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డితో పాటు పలువురికి నోటీసులు జారీ చేశారన్నారు.

గండికోటను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం



గుర్రపుస్వారీ చేస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జేసీ అదితిసింగ్



నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థినిలు

- గుర్రపుస్వారీని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

జమ్మలమడుగు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని కలెక్టర్ శివశంకర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గండికోటలో పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటకులను ఆకర్షించేందుకు ఏర్పాటు చేసిన గుర్రపు శాల కేంద్రాన్ని, ఎస్‌బీఐ హరిత హోటల్‌లో ఏటీఎం సెంటర్‌ను కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ప్రారంభించారు. అలాగే గండికోటలో తాగునీటి ఇబ్బందులు లేకుండా రూ. 55 లక్షలతో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దడం కోసం కృషి చేస్తామన్నారు. పర్యాటకం అభివృద్ధి జరిగితే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

టూరిస్టులు వివరాలు నమోదు చేసుకోవాల్సిందే..

పర్యాటక కేంద్రమైన గండికోటకు వచ్చే పర్యాటకులు ఇకపై వారి వివరాలు తెలపాలి. శుక్రవారం గండికోట ప్రారంభంలోనే టోల్ గేట్‌ను టూరిజంశాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అందులో కోటలో ప్రవేశానికి రుసుం, వాహనాలకు టోల్ గేట్ చెల్లించి వారి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంది.



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గండికోటలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు, ప్రొద్దుటూరు, జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల విద్యార్థులు సైతం గండికోటలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, జిల్లా, రెవెన్యూ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దోమల నివారణకు స్పెషల్‌డ్రైవ్

ముద్దనూరు: దోమ పుట్టకూడదు–దోమ కుట్టకూడదు అనే నినాదంతో దోమల నివారణకు ప్రతి శుక్రవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్టీ కాలనీలో ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా, దోమ గుడ్డును ఎలా నిర్మూలించాలి అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

డెంగీతో వివాహిత మృతి


కె.సువర్ణ (ఫైల్)

ప్రొద్దుటూరు/రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని అర్కటవేముల గ్రామానికి చెందిన కె.సువర్ణ (27) డెంగీ వ్యాధితో చికిత్స పొందుతూ మృతి చెందింది. అనారోగ్యంగా ఉండటంతో సువర్ణను ఈనెల 24న స్థానిక సాయికుటీర్ రోడ్డులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈమెకు డెంగీ సోకిందని 24 గంటలు గడవక ముందే పరిస్థితి విషమంగా ఉండటంతో.. కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వైద్యుల సూచన మేరకు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఆమెను సాయంత్రం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. సువర్ణ, దిలీప్ నరసింహారెడ్డి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమ కుటుంబంలో జరిగిన సంఘటనను చూసి గ్రామ ప్రజలు అప్రమత్తం కావాలని ఈ సందర్భంగా కుటుంబ యజమాని రిటైర్డు వ్యాయామ ఉపాధ్యాయుడు కోటా ఓబుళరెడ్డి తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన గుర్తు తెలియని యువకుడు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని యువకుడు శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. యువకుడు తెల్లటి, నల్లటి చారలు గల చొక్కా, బ్లూ రంగు గల నైట్ పాయింట్ ధరించాడు. వయసు సుమారు 20–25 దాకా ఉండవచ్చు. చెన్నై నుంచి ఎర్రగుంట్లకు రైలు టికెట్ కలిగి ఉన్నాడు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే తమకు తెలియజేయాలని ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు తెలిపారు.

వ్యక్తిగత కారణాలతోనే పూజారి ఆత్మహత్య

ప్రొద్దుటూరు కల్చరల్ : దత్తాత్రేయ స్వామి ఆలయ పూజారి వీణా రామానుజాచార్యులు వ్యక్తిగత కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నారని ఆలయ ఈఓ కె.రామచంద్రాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయంలో వివిధ పూజల పేరిట డబ్బులు వసూలు చేయడం, దత్త కల్యాణానికి నిధులు సేకరిస్తున్నాడని ఫిర్యాదులు వచ్చాయని, ఆ కార్యక్రమాలన్నీ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తాము తెలిపామన్నారు. దీనితో ఆయన ఈఓ కార్యాలయానికి వచ్చి అధికారులను దూషించేవారని పేర్కొన్నారు. ఆయన వ్యక్తిగత, కుటుంబ సమస్యల వల్ల మానసిక ప్రశాంతత లేక ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఆయన ఆత్మహత్యకు తనకు ఎటువంటి సంబంధం లేదని వివరించారు.

హత్య కేసులో 12 మందికి యావజ్జీవ శిక్ష

- 16 ఏళ్ల క్రితం గ్రామంలో ఆధిపత్యం కోసం హత్య
- కేసు విచారణ సమయంలో అనారోగ్యంతో 9 మంది మృతి
- తీర్పు వెల్లడించిన ప్రొద్దుటూరు సెకండ్ ఏడీజే కోర్టు


హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడిన నిందితులను హాజరు పరిచిన పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : ఆధిపత్య పోరులో భాగంగా 16 ఏళ్ల క్రితం హత్యకు గురైన బీచు పుల్లారెడ్డి కేసులో 12 మందికి ప్రొద్దుటూరు ఏడీజే కోర్టు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.4.70 లక్షల చొప్పున జరిమానా విధించింది. ఈ సంఘటనకు సంబంధించి 22 మందిపై కేసు నమోదైంది. అయితే ఈ కేసు విచారణలో ఉన్న సమయంలోనే అనారోగ్యంతో 9 మంది నిందితులు చనిపోయారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో చాలా ఏళ్ల నుంచి నల్లపురెడ్డి వెంకటరమణారెడ్డి, ములకపాక పిచ్చిరెడ్డి వర్గీయుల మధ్య గ్రామాధిపత్య గొడవలు ఉండేవి. ఈ క్రమంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, సిమెంట్‌రోడ్డుకు సంబంధించిన కాంట్రాక్ట్ పనులు నల్లపురెడ్డి వెంకటరమణారెడ్డి వర్గానికి వచ్చాయి. ఈ పనులన్నీ వీళ్లకే రావడంతో పిచ్చిరెడ్డి వర్గీయులు అసూయతో రగిలిపోయారు. వీరిని అంతమొందిస్తే గ్రామమంతా తమ గుప్పిట్లో ఉంటుందని భావించారు. ఈ క్రమంలో 2008 డిసెంబర్ 22న నల్లపురెడ్డిగారి వెంకటరామిరెడ్డి, బీచు పుల్లారెడ్డిపై రాడ్లు, వేటకొడవళ్లు, కట్టెలతో దాడి చేశారు. ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన బీచు పుల్లారెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో 315/2008 క్రైం నంబర్ కింద కేసు నమోదు అయింది. హత్య కేసులో పాల్గొన్న 22 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ ప్రొద్దుటూరు సెకండ్ ఏడీజే కోర్టులో కొనసాగుతూ వచ్చింది. తుది విచారణలో నేరం రుజువు కావడంతో 12 మంది ముద్దాయిలైన ములపాక పిచ్చిరెడ్డి, తవ్వా ఎర్రయ్యగారి లక్ష్మిరెడ్డి, జంగంరెడ్డి వీరారెడ్డి, తవ్వా మునింద్రారెడ్డి, జంగంరెడ్డి సుధాకర్, పెద్దసుబ్బారెడ్డి, ములపాక సువిగారి సుబ్బారెడ్డి, జంగంరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జంగంరెడ్డి నడిపిసుబ్బారెడ్డి, తవ్వా ఎర్రయ్యగారి ఓబుళరెడ్డి, జంగంరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జంగంరెడ్డి రామసుబ్బారెడ్డిలకు యావజ్జీవ కారాశిక్షతోపాటు రూ.4.70 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ సెకండ్ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. కాగా కేసు విచారణలో ఉండగా అనారోగ్య కారణాలతో 9 మంది మృతి చెందారు. కేసులోని ఏ3గా ఉన్న తవ్వా ఎర్రయ్యగారి పెద్ద ఓబుళరెడ్డి మీద నాన్‌బెయిల్ వారెంట్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కేసును పర్యవేక్షిస్తూ సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరచి ముద్దాయిలకు శిక్ష పడేలా చేసిన ప్రస్తుత మైదుకూరు అర్బన్ సీఐ సయ్యద్‌హాషం, ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, మైదుకూరు ప్రాసెస్ కానిస్టేబుల్ రాజశేఖర్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ బి.రాంప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు.

కడప కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి



కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా నిమ్మనపల్లె మనోజ్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ హోదా కలిగిన ఈయన పలమనేరు ఆర్‌డీఓగా పని చేస్తుండే వారు. కడప కమిషనర్‌గా ఉన్న వైఓ నందన్ సీడీఎంఏ డీడీగా బదిలీ అయిన నేపథ్యంలో ఆయన్ను కొత్త కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

పులివెందుల రూరల్ : పులివెందులలోని కదిరి రింగ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో ఆగస్టు 13వ తేదీన జరిగిన చోరీ కేసులో సురేష్ కుమార్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చోరీ కేసుకు సంబంధించి ఎస్పీ ఆదేశాల మేరకు అర్బన్ సీఐ జీవన్ గంగానాథ్, ట్రాఫిక్ సీఐ హాజీవల్లి, ఎస్ఐ నారాయణలతో ఒక టీంను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. శుక్రవారం ఈ చోరీకి పాల్పడిన సురేష్ కుమార్ అనే వ్యక్తిని ఆర్టీసీ బస్టాండ్ వద్ద అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఇతని వద్ద ఉన్న రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసుకు సంబంధించి మరో నిందితుడు అలెగ్జాండర్ పరారీలో ఉన్నాడని, అతని కూడా గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. సురేష్ అనే వ్యక్తి మద్యం షాపులో బాటిళ్లు సమకూర్చుతూ ఉండేవాడని.. అలా డబ్బులు ఎక్కడ పెడతారో అన్నీ గమనించి సురేష్, అతని స్నేహితులిద్దరూ కలిసి ఈ దొంగతనానికి పాల్పడ్డారన్నారు.

ఏటీఎం కేంద్రాల్లో చోరీ కేసుపై పురోగతి

కడప అర్బన్ : కడప నగరంతోపాటు ఒంటిమిట్టలో ఈ నెల 21న అర్ధరాత్రి తెల్లవారుజామున మూడు ఏటీఎం మిషన్‌లపై దుండగులు దాడి చేశారు. ఈ సంఘటనలో కడపలోని ఎస్‌బీఐ ఏటీఎం మిషన్ నుంచి రూ.6.19 లక్షలు, ఒంటిమిట్ట ఎస్‌బీఐ ఏటీఎం నుంచి రూ.36.11 లక్షలను మొత్తం దాదాపు రూ.42 లక్షల మేరకు నగదును కాజేసి పరారయ్యారు. ఈ సంఘటనపై జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు దాదాపు 10 ప్రత్యేక పోలీస్ బృందాలు.. అదే రోజు దేశవ్యాప్తంగా గంటల వ్యవధిలో వెళ్లారు. హర్యానా, రాజస్థాన్, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లారు. ఈ క్రమంలోనే కేరళ రాష్ట్రంలో ఏటీఎం దొంగలకు సంబంధించిన ముఠాను వాహనాల తనిఖీ సమయంలో అనుమానం వచ్చి అక్కడి పోలీసులు వెంబడించారు. వారిలో ఇద్దరిపై కాల్పులు జరుపగా ఒకరు మృతి చెందినట్లు సమాచారం. ఏడుగురిలో ఒకరు మృతి చెందగా మిగిలిన ఆరుగురిని అదుపులోకి తీసుకుని, విచారణ చేస్తున్నట్లు సమాచారం. కడప జిల్లాలోని ఏటీఎం దొంగల ముఠా, కేరళలో ఏటీఎం మిషన్‌లను కొల్లగొట్టిన ముఠా ఉపయోగించిన వాహనాలు.. రెండూ ఒకటేనని సమాచారం. ఆ కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆ ముఠాకు కడపలో దోపిడీ చేసిన ముఠాకు దగ్గర పోలికలుంటే ఈ కేసులో పోలీసులు పురోగతి సాధించినట్లే.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం


మృతి చెందిన వెంటకసుబ్బయ్య

ఖాజీపేట : ఖాజీపేట సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకటసుబ్బయ్య అనే వృద్ధుడు దుర్మరనం చెందాడు. కూనవారిపల్లెకు చెందిన కల్లూరు వెంకటసుబ్బయ్య (68) ఖాజీపేటకు వచ్చి తిరిగి కాలినడకన కూనవారిపల్లె గ్రామానికి వెళ్లే మార్గంలో జాతీయ రహదారి దాటుతుండగా.. మైదుకూరు నుంచి వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటసుబ్బయ్య మృతి చెందారు. ద్విచక్రవాహనంపై వస్తున్న ఐజర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ఖాజీపేట సీఐ మోహన్ గాయపడ్డ వ్యక్తిని కడప రిమ్స్‌కు తరలించారు. మృతి చెందిన వ్యక్తిని శవపరీక్షల నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

చాపాడు : మండల పరిధిలోని అన్నవరం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలికకు నిర్వహించ తలపెట్టిన వివాహాన్ని శుక్రవారం ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఆ బాలిక తల్లిదండ్రులను పోలీసులు అదుపులో తీసుకున్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు బైండోవర్ కేసు నమోదు చేసి, బాలికను, కారకులకు తహసీల్దార్ రవీంద్రారెడ్డి ఎదుట హాజరుపరిచారు.

ఉత్సాహంగా సెపక్‌తక్రా ఎంపికలు


సెపక్‌తక్రా బాలికల జట్టుతో నిర్వాహకులు

కడప స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి సెపక్‌తక్రా ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఎంపికలను వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.సాజిత్, ఎల్.వెంకటలక్ష్మి, మహబూబ్‌బాషా, షీనాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్–14, అండర్–17 బాలబాలికల విభాగంలో ఎంపికలు నిర్వహించి, జిల్లా జట్లను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రకటించారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్–14 బాలికలు : ఎ.యామిని, డి.లక్ష్మి, ఎన్.నాగరమ్య, జె.కీర్తన, బి.నాగవైష్ణవి, డి.సింధు, ఎం.హేమలత

అండర్–17 బాలికలు : పి.నిహారిక, ఎస్.ఇందిర, జి.అంజలి, ఎన్.ప్రవీణ, కె.సువర్ణ, ఆర్.నిస్సీ

అండర్–14 బాలురు : బి.అభిషేక్, ఎస్.నిఖేశ్వర్, ఎస్.జుబేర్, సి.అబ్దుల్‌లతీఫ్, ఎస్. సల్మాన్

అండర్–17 బాలురు : ఎస్.ముస్తాక్, ఎస్.అల్తాఫ్, జగదీష్, సంపత్‌కుమార్, హుస్సేన్, సొహైల్, హసన్

జిల్లా రైఫిల్ షూటింగ్ జట్ల ఎంపిక


జిల్లా రైఫిల్ షూటింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్/ప్రొద్దుటూరు : పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ప్రొద్దుటూరు పట్టణంలోని జార్జిక్లబ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు ప్రవీణ్‌కిరణ్, రాఘవ, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్–14 బాలికలు : వి.జాగృతి, ఎస్.జహారత్

అండర్–17 బాలికలు : వి.ఫైజాసుల్తానా, వి.మనిష్, సి.హెచ్.వెరోనిక

అండర్–14 బాలురు : ఎం.జైధీర్ కిరణ్, ఎస్ఎండీ ఉజ్జైర్, నితిన్

అండర్–17 బాలురు : రైఫిల్ విభాగం : ఎస్.మహమ్మద్ ఉబేద్, కె.అబ్దుల్ ఖయాం, పి.నాగూరు, **పిస్టల్ విభాగం :** ఎస్. భవగ్న, యు.నిఖిల్, ఎస్.ఎన్.అశోక్‌హుస్సేన్

వెంకటేశ్వర ట్రేడర్స్‌పై విచారణ చేయాలి

- ఎస్సీ కార్పొరేషన్ వాహనాలపై అసత్య ప్రచారాలు
- బురదజల్లడమే పనిగా పెట్టుకున్న టీడీపీ నేతలు
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఆటోలు, డీసిల్టింగ్ మిషన్లు సరఫరా చేసిన వెంకటేశ్వర ట్రేడర్స్‌పై విజిలెన్స్ విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, 14వ డివిజన్ కార్పొరేటర్ కె.బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవికి ఎస్సీలపై ఉన్నట్టుండి ప్రేమ పుట్టుకొచ్చిందన్నారు. వారు మొన్న కలెక్టర్‌ను వెంటబెట్టుకొని మహిళా ప్రాంగణానికి వెళ్లి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన వాహనాలను లబ్ధిదారులకు ఇవ్వకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా ధనాన్ని వృథా చేసిందని పేర్కొనడం దారుణమన్నారు. 2014లో ఎస్సీ లబ్ధిదారులు తమ జీవనోపాధి కోసం ప్యాసింజర్ ఆటోలకు దరఖాస్తు చేసుకుంటే 2018లో టీడీపీ ప్రభుత్వం చెత్త తరలించే లగేజీ వాహనాలు ఇచ్చిందన్నారు. 165 వాహనాలు మంజూరైతే 95 వాహనాలు మాత్రమే గ్రౌండ్ అయ్యాయని, అలాగే డీసిల్టింగ్ మెషీన్లు 50 మంజూరైతే 16 మాత్రమే గ్రౌండ్ అయ్యాయని, మిగిలిన వాటిని లబ్ధిదారులు తీసుకోకపోవడం వల్లే అవి మూలనపడ్డాయే తప్ప, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దానికి కారణం కాదన్నారు. అప్పట్లో విజయవాడ కేంద్రంగా ఈ కొనుగోళ్లు జరిగాయని, ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. ముఖ్యంగా కడప నగరానికి వాహనం కూడా మంజూరు కాలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో మహిళా ప్రాంగణం ఓ వెలుగు వెలిగిందని, టీడీపీ ప్రభుత్వం వచ్చాక దాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. ఎస్సీలను ఈ ప్రభుత్వం ఏదో ఉద్ధరిస్తుందని చెప్పడానికి శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే మాధవి తంటాలు పడుతున్నారన్నారు. ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అని చంద్రబాబు వ్యాఖ్యానించిన విషయాన్ని ఎస్సీలు ఎవరూ మర్చిపోరన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, కార్పొరేటర్ చెన్నయ్య, శ్యామ్ పాల్గొన్నారు.

లౌకిక ప్రజాస్వామ్యం కోసం ఏచూరి కృషి


మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎ.గఫూర్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : భారత రాజ్యాంగం పీఠికలోని అంశాలకు రక్షకుడిగా, లౌకిక ప్రజాస్వామ్య రక్షణ కోసం తన జీవితాన్ని ధారపోసిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎ గఫూర్ అన్నారు. శుక్రవారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అఖిలపక్ష, వామపక్ష నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం గఫూర్ మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్యంలో ఇప్పుడు సీతారాం ఏచూరి లేని లోటు పెద్ద శూన్యం అన్నారు. విలువల కోసం నిబద్ధతతో ఆయన సాగించిన నడక ఎందరికో దారి చూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా కమిటీ చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి జి.చంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, ప్రజా సంఘాల నాయకులు నారాయణ, సంగటి మనోహర్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గుర్రప్ప, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శివకుమార్, రామ్మోహన్, మనోహర్, దస్తగిరి రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అనంతపురంలో అక్టోబర్ 5,6,7,8 తేదీల్లో జరుగుతున్న ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర వర్క్‌షాప్ మహాసభలు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి ఎద్దు రాహుల్, వీరపోగు రవి తెలిపారు. శుక్రవారం నగరంలోని స్థానిక ఎస్‌ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి శ్రీకారం చుట్టాలని, అందుకు ప్రణాళిక ఏర్పాటు చేయడం కోసం అనంతపురం వేదిక కాబోతుందన్నారు. అన్ని జిల్లాల నుంచి ఎస్‌ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు హాజరు అవుతున్నారని, 4 రోజులు ఈ నిర్మాణ మహాసభలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, నాయకులు అరవింద్, దేవ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో సినిమా షూటింగ్

రాయచోటి టౌన్ : రాయచోటిలో సినిమా షూటింగ్ జరుగుతోంది. రాయచోటి ప్రాంతానికి చెందిన దర్శక, నిర్మాతగా వ్యవహరిస్తూ నిర్మిస్తున్న దేవగుడి సినిమా రాయచోటి పరిసర ప్రాంతాలలో గత పదిహేను రోజులుగా షూటింగ్ జరుగుతోంది. శుక్రవారం రాయచోటిలోని సాయిబాబా మందిరం సమీపాన హైవే రోడ్డుపై షూటింగ్ చేయంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

29న సీమ విద్యావంతుల మహాసభలు


మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం రాయలసీమ విద్యావంతుల వేదిక 4వ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోకన్వీనర్ మహమూద్ మాట్లాడుతూ ఈనెల 29న స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న మహిళా శక్తి భవనంలో రాయలసీమ విద్యావంతల వేదిక 4వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలో వక్తలుగా రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, అనంత హక్కుల ఉద్యమకారుడు రామాంజనేయులు, రచయిత అప్పిరెడ్డి హరినాథరెడ్డి, వామపక్ష పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని వివరించారు. రాయలసీమ హక్కుల కోసం ప్రతి ఒక్కరూ గొంతు ఎత్తాలని రాయలసీమ విద్యావంతుల వేదిక పిలుపునిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధి వెంకటరెడ్డి, ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు రఘురాంరెడ్డి, రామసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, ప్రముఖ రచయిత దాదాహయత్, ఏపీ పౌరహక్కుల సంఘం ప్రతినిధి సురేష్‌బాబు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి, రాజేష్, విరసం ప్రతినిధి వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి పద్మ, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నీటిలో మూగజీవాల ప్రాణాలు



కాలువలో ఉన్న గేదెకు తాడు కడుతున్న వ్యక్తి, గేదెను తాళ్ల సాయంతో బయటకు లాగుతున్న పోలీసులు, ప్రజలు

ఎట్టకేలకు కాపాడిన పోలీసులు, ప్రజలు

రాజుపాళెం : కొన్ని గంటల పాటు మూగజీవాలు నీటిలో విలవిలలాడాయి. కాలువలో పడి నరకయాతన అనుభవించాయి. ఎట్టకేలకు కొందరు సకాలంలో స్పందించి వాటిని కాపాడారు. ఈ సంఘటన రాజుపాళెంలో శుక్రవారం చోటుచేసుకుంది. రాజుపాళెంకు చెందిన శ్రీనివాసులు ఉదయాన్నే గేదెలను మేపడానికి అయ్యవారిపల్లె వైపు తీసుకెళ్లాడు. ఈ క్రమంలో కేసీ చాపాడు కాలువలో నీటి ప్రవాహానికి 3 గేదెలు, 4 దూడలు కొట్టుకుపోయాయి. ఆయన వెంటనే పోలీసులు, స్నేహితులు, గ్రామస్తులకు సమాచారాన్ని అందించారు. ఓ వ్యక్తి కాలువలోకి దిగి గేదెలకు, దూడలకు తాళ్లతో కట్టాడు. తర్వాత అందరూ కలిసి పైకి అతి కష్టం మీద బయటకు లాగారు. దీంతో ఎస్ఐ వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, పోలీసులు, గ్రామస్తుల సాయం మరువలేనిదని ఆ పాడి రైతు వారికి ధన్యవాదాలు తెలిపారు. మీరంతా లేకుంటే తమ గేదెలు తనకు దక్కేవి కావని ఆయన చెప్పారు.

హోటళ్లు, బార్ రెస్టారెంట్‌లపై
విజిలెన్స్ దాడులు


తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప అర్బన్ : కడప రీజినల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శుక్రవారం కడపలో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్‌లలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నగర శివారులోని రాజంపేట బైపాస్ రోడ్‌లోని పునీత్ బార్ అండ్ రెస్టారెంట్‌లో పరిసరాలు అపరిశుభ్రంగా వున్నందుకు రూ.40 వేలు, జీఎస్‌టీ సర్టిఫికెట్ డిస్‌ప్లే చేయనందున రూ.50 వేలు, వేయింగ్ మిషన్‌ను తూనికలు, కొలతలు శాఖ వారిచే స్టాంపింగ్ చేయనందున రూ.8 వేలు జరిమానాగా విధించారు. తరువాత సితార గార్డెన్ అండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో కాలం చెల్లిన ఆహార పదార్థాలను వినియోగించడం, పలుమార్లు కాచిన నూనెను వాడుతుండటం వల్ల ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ చట్టం ప్రకారం రెండు కేసులు నమోదు చేశారు. కిచెన్ పరిసరాలు అపరిశుభ్రంగా వున్నందున రూ.20 వేలు జరిమానాగా విధించారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులైన సీఐ జి.ఈదురు బాషా, అగ్రికల్చర్ ఆఫీసర్ ఈ.బాలగంగాధర్‌రెడ్డి, ఎఫ్ఆర్ఓ జె.మురళీకృష్ణ, డీసీటీఓ బి.బాబుమోజెస్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఎం.డి షంషీర్‌ఖాన్, మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.